## గోపీచంద్‌కథ

# తమసోమ జ్యోతిర్గమయ

**వెలుగును వెతికి పట్టుకొని, దాని కాంతిని ప్రసరింప చేయడమే గోపీచంద్ జీవితాశయంలా వుంది.**

జీవించినన్నాళ్ళు... సత్యాన్ని వెతుకుతూనే ఉన్నాడు

**ఎందుకు?**

అన్న ప్రశ్నను కన్నతండ్రి కవిరాజు వద్ద తెలుసుకొని [illegible]ధానం అన్వేషిస్తూ... యమ్.ఎన్. రాయ్ అడుగు జాడలో హేతువాద పటిమ యొక్క [illegible]తుకతను అలవరచుకున్నాడు. తత్ ఫలితమే... నిరంతర సత్యాన్వేషిగా మారడం.



ఈ అన్వేషణలో...
మనిషినీ
అతని ప్రకృతినీ
భావుకతను... మేధనూ...
చరిత్రనూ... వెదికి
అంతరాంతరాలలోకి దిగి...
అంతటితో ఆగక... విశ్వగమనాన్ని విమర్శనాత్మకంగా... అవలోకించి
సహేతుకంగా సమీక్షించ గలిగాడు
ఇదే...
జిజ్ఞాసామార్గాన... నడచి నడచి... కొన్ని గమ్యాలను చేరుకోగలిగాడు
'విశ్వాత్మ' ఒకడున్నాడనీ తెలుసుకున్నాడు.
గోపీచంద్ అన్వేషణలో ఇదే చివరి మజిలీ అని నేను అనుకోను.
జీవించి ఉంటే... ఇంకింత నడక మిగిలి ఉందనేది...
సాహితీ జిజ్ఞాసులకు అర్థమయ్యేది.
ఆయన వ్రాసిన 'పోస్టు చేయని ఉత్తరాలు' తాత్వికరంగాన్ని
ఎంతటి కుదుపు కుదిపాయో మనకు తెలుసు.
ఆయన చెప్పిన ప్రతి పదంలోను...
అన్వేషణ... జిజ్ఞాస... కనిపిస్తూనే వుంది గదా...
అనేక సందర్భాలలో గోపీచంద్‌తో... పాఠకులు ఏకీభవించకపోవచ్చు.
కానీ.. ఆయన ప్రసరించిన చేవగల్గిన భావాలతో... ఆలోచనా పరులవుతారు.
నడక మొదలవుతుంది... మేథ వెన్నంటి ఉంటుంది.
అట్టి మహనీయుని జయంతి ఇది.

-చా వా శివకోటి.

●●●

**సెప్టెంబర్ 8వ తేదీ గోపీచంద్ జయంతి సందర్భంగా**

●●●

# అమలిన శృంగారం

◆ శ్రీ త్రిపురనేని గోపీచంద్ ◆

**అగరువత్తులు, సెంట్లు, మంచి గంధం మొదలైన సువాసన ద్రవ్యాలు అమ్మే షాపుల ముందునుంచి వస్తున్నాను.**

సువాసన ద్రవ్యాలు, కొనటానికి నేనక్కడికి రాలేదు. ఆ షాపులకు పైన కూరగాయల మార్కెట్టు ఉంది. అక్కడ ఒక అరవీశ దోసకాయలు, ఒకతుంపు కొత్తిమేర, ఒక కట్ట కరివేపాకు కొనుక్కొని ఇంటికి వెడుతున్నాను. నా చేతిలో వున్న దోసకాయలు మొదలైన వస్తు సంచయం చూసి అనుకుంటాను, ఆ షాపుల వాళ్ళెవరూ నన్ను లోపలికి రమ్మని పిలువలేదు.

నేనా షాపులు దాటి ఒక అడుగు ముందుకు వేశానో లేదో ఒక ఆడది నాదారి కడ్డం వచ్చింది. తప్పుకు వెడదామని ఒక వక్కకి తొలిగి వెళ్ళిపోవడానికి ప్రయత్నించాను. అటొచ్చి నా కెదురుగుండా నిలబడింది. ఈ ప్రకారం నాలు గయిదుసార్లు జరిగిన తరువాత నాకు అనుమానం కలిగి దాని ముఖం విమర్శగా చూశాను. అది చెయ్యాలనే చేస్తూ వుంది. నా దారికడ్డం రావాలనే వస్తూ వుంది.

నేనా వూళ్ళో ఇంతో అంతో పరువుగా బ్రతుకుతున్న వాణ్ణి. ఇటువంటి సంఘటనలు ఎరిగిన వాణ్ని కాదు. కంగారపడి ఏదో వొక విధంగా తప్పించుకుని వెళ్ళడానికి ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. ఆ మనిషి




ఎప్పటికప్పుడు నా దారి అడ్డగిస్తూనే వుంది.

ఇంతలో వక్కనున్న కిళ్ళీ కొట్టువాడు, "అయ్యోర్యూ, కదలకుండా నిలవండి?" అని కేకలేశాడు. మమ్మల్నీ, మా సత్ప్రవర్తననీ, మా కుటుంబ గౌరవాన్నీ మా తండ్రులు దగ్గర నుంచీ ఎరుగును వాడు.

వాడి మాట వల్లో, కంగారు వల్లో, లేకపోతే ఏమీ తోచకో నేను కదలకుండా నుంచున్నాను. నేను నిలబడటం చూసి అది నా చొక్కా

◆ ◆ ◆

## మెరుపులు

ఒక రోజు ప్రొద్దుటే నిద్రలేచిన దేముడు... నౌకరును పిలిచినాడు.

ఎన్నిసార్లు పిలిచినా... ఎవ్వరూ పలకలేదు.

దేవుని ఖజానాలో పైకం కొరత ఏర్పడిన కారణంగా... నౌకర్లను తగ్గించిన సంగతి... అప్పుడు గుర్తుకొచ్చి... విచారంగా కూర్చున్నాడు.

అతనిని చూసి దేవుడిలా ప్రశ్నించాడు.

"మర్త్యలోకం నుంచేనా?" అని.

"చిత్తం..."

"ఏమిటి సంగతులు?"

"అంతా బాగానే వుంది. మానవుడు, సగం జీవితం నేర్చుకొనడంలోనూ, మిగిలిన సగం, తను నేర్చుకున్నది తప్పు అని తెలుసుకొనడంలోనూ గడుపుతున్నాడు" అన్నాడు నౌకరు.

"మంచిది. కనుక ఇప్పట్లో మనకేమి ఫర్వాలేదన్నమాట. ఇంకొన్నాళ్ళ వరకు మన భుకికి లోటుండదు" అని కులికాడు దేముడు.

శ్రీ త్రిపురనేని గోపిచంద్

◆ ◆ ◆

# గోపీచంద్ కథ



పైకెత్తి, నా పొట్ట మీద తన చూపుడు వేలితో మూడుసార్లు నెమ్మదిగా పొడిచి, "అడగకుండా వున్నా బాగుండేది" అని ఎక్కెక్కి ఏడూస్తూ వెళ్ళిపోయింది.

అది వెళ్ళిపోయింది. కాని నాకు కాలూ చెయ్యి ఆడలేదు. అలాగే నుంచున్నాను. కిళ్ళీ కొట్టువాడు చిరునవ్వు నవ్వుతూ నా దగ్గరకు వచ్చి, "వెళ్ళండి, అయ్యోర్రూ; ఇక అది మీ జోలికి రాదులే" అన్నాడు.

నేను కొంచెం నిలదొక్కుకుని, "ఏమిటోయ్ వెంకన్నా ఇట్లా చేసింది?" అని అడిగాను.

"ఖర్మా. అయ్యోర్రూ, పావం, అదీ వొకప్పుడు బాగా బతికిందే, రంగసాని అంటే ఈ ముప్పైమూడు వూళ్ళకీ ఎంత పెసిద్ది?" అన్నాడు వెంకన్న.

"అది బోగందా ఏమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాను.

"అవునయ్యోర్రూ" అన్నాడు వెంకన్న.

"మరెందుకిట్లా తయారయింది?" అని అడిగాను.

వెంకన్న బోగం రంగసాని కథ చెప్పాడు.

బోగం రంగసాని ఆ వూళ్ళోకల్లా గొప్ప బోగంది. ఆ రోజుల్లో... అనేక మంది రసికులు దాని పొందుకోసం తహతహ లాడుతూ వుండేవారు. ఎంత డబ్బు కావాలన్నా గుమ్మరించి పోతూ వుండేవారు. రంగసాని కూడా హృదయబాధ లేకుండా చేసుకుని, డబ్బే ప్రధానంగా పెట్టుకుని వ్యాపారం సాగించింది. ఎన్నో మేడలు కట్టించినది, ఎంతో పొలం కొన్నది.

◆ ◆ ◆

## మెరుపులు

ఒక కవి తన స్నేహితుడైన ధనికుడిని... "డబ్బు కొద్దిగా కావాలి బదులివ్వు ఇంట్లో బియ్యం నిండుకున్నాయి" అనడిగాడు.

"నా దగ్గిన దమ్మిడి లేదు. డబ్బెక్కడి నుంచి వస్తుంది? నా దొడ్లో పండుతుందా అదీ కాక నేనిన్ని సార్లు ఇవ్వలేను" అన్నాడు.

"నాకెప్పుడిచ్చారు."

"నువ్వు చచ్చాక శిలా విగ్రహానికి ఇవ్వాలి కదా... ఇప్పుడు ఇచ్చి అప్పుడు ఇచ్చి నాకిదే పనా?" అన్నాడు.

కవికి ఆ రాత్రి కల వచ్చింది.

తన భార్య పిల్లలు తిండి లేక ఒక ప్రక్కన ఏడుస్తుంటే...

ఒక ప్రక్కన తన శిలా విగ్రహం తయారవుతుంది.

శిలా విగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని... దాతృత్వానికీ...

రస హృదయానికీ జనం అతన్ని వేనోళ్ళ కొనియాడుతూ 'జేజే'లు పలుకుతున్నారు.

శ్రీ త్రిపురనేని గోపీచంద్

◆ ◆ ◆

ఎంతో డబ్బు సంపాదించింది.

కాని వున్నట్టుండి ఆమెలో విపరీతమైన మార్పు వచ్చింది. విటుల్ని తన ఇంటి చాయలకి రానిచ్చేది కాదు. ఒక్కతే కూర్చుని జీవితం గడుపుతూ ఉండేది. ఆ మార్పు ఎట్లా వచ్చిందో, ఎందుకు వచ్చిందో ఎవరికీ తెలియదు.

ఆ రోజుల్లో రాము అనే కుర్రవాడొకడు ఆమె ఇంటికి వెళ్ళి వస్తూ వుండేవాడు. రాము చాలా తెలివైన, చురుకైన, అందమైన కుర్రవాడు.

అతను వెళ్ళి రావటం కనిపెట్టి మొదట్లో అందరిలాగే అతనూ ఆమె వలలో చిక్కుకున్నాడనీ, బంగారం లాంటి కుర్రావాణ్ని భోగం రంగసాని తన పొట్టన పెట్టుకుంటూ వుందనీ వూరంతా ఆగుబ్బుగా చెప్పుకోవటం మొదలు పెట్టారు.

కాని కొద్దిరోజులు గడిచేటప్పటికి యదార్థం అందరికీ తెలిసింది. రంగసాని ఆ కుర్రవాణ్ని హృదయపూర్వకంగా ప్రేమించింది. ఏ తోటలో చూచినా, ఏ నది ఒడ్డున ఎక్కడ చూచినా వాళ్ళిద్దరే కనిపిస్తూ ఉండేవారు. రంగసాని తన చుట్టూ వున్న ప్రపంచాన్నే మరిచిపోయినట్టూ, ఆ కుర్రవాడే తన సర్వస్వం అయినట్టూ ప్రవర్తిస్తూ వుండేది.

కొంతమంది వాళ్ళని చూచి "దాని జీవితం చూడరా, ఎంతలో ఎంతగా మారిపోయిందో? నిజంగా ప్రేమ అంటే ఏమిటో దానికిప్పుడు తెలిసి వచ్చింది" అనేవారు. మరి కొంతమంది "ఇదొక టక్కురా, భోగం దానికి, దానికి ప్రేమ ఏమిటి?" అని యీసడించేవారు.

ఎవరేమనుకున్నప్పటికీ వాళ్ళిద్దరూ ఒకర్నొకరు గాఢంగా ప్రేమించుకున్నారన్న మాట వాస్తవం. అందులో సందేహం లేదు. ఆ కుర్రవాడితో కలిసినప్పటి నుంచీ రంగసానికి ప్రపంచమే కొత్తగా కనిపించింది. ప్రపంచం ఆనందమయంగా, అనుభవించిన కొద్దీ ఎక్కువయ్యే తియ్యదనంగా కనిపించింది. తనలో వచ్చిన మార్పుకి ఆమెకే ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ గాలిలో తేలిపోతున్నట్లు నడిచేది. మాటే ఒక తేనెవాకగా మాట్లాడేది! అర్ధనిమీలిత నేత్రాలతో తనలోని ఆనందాన్ని తానే అనుభవిస్తున్నట్లు ఉండేది. కాని ఆ కుర్రవాడు మాత్రం మొదటి నుంచీ కొంచెం బెరుకు బెరుకుగా వుండేవాడు. మొదటి ఉధృతంలో రంగసాని ఈ విషయం గమనించలేదు. తరువాత అనుమానం కలిగి అడిగింది.

"ఎందుకు అలా వుంటావు?"

కుర్రవాడు సిగ్గుపడ్డాడు.

"చెప్పవ్?"

ఆమె మొహంలోకి చూడలేక తల వొంచుకుని "ఏమీ లేదు" అన్నాడు కుర్రవాడు.

"పాపం కొత్త" అనుకుని జాలిపడింది రంగసాని.

ఆ జాలి ఆమె ప్రేమను మరీ ఎక్కువ చేసింది.

కాని త్వరలోనే ఆమెకు మరొక విషయం కూడా తెలిసింది. ఆ కుర్రవాడు ఎప్పుడూ తనతోనే తిరుగుతాడు. చూచినవాళ్ళు ఏవరైనా ఏమన్నా అనుకుంటారేమో అని భయం కూడా లేదు. తన దగ్గర ఎంతో అమాయకంగా పసివాడికి మల్లే ప్రవర్తిస్తాడు. తన్ను చూడకుండా ఒక క్షణం కూడా వుండలేడు. కాని గదిలోకి రమ్మంటే మాత్రం ఉలికిపడతాడు. ఏదో వొకటి చెప్పి తప్పించుకుంటాడు.

ఈ విషయం గమనంలోకి వచ్చినప్పటి నుంచీ రంగసాని మనస్సు కలవరపడటం మొదలు పెట్టింది. తను నిర్మించుకున్న ఆశాసౌధాలు కూలుతాయని భయం వేసింది. అతను తనకి కాకుండా పోతాడేమోనని దిగులు పుట్టింది. ఈ సుఖం స్వప్నానికి మల్లే తృటిలో అదృశ్యమవుతుందేమోనని బెంగ కలిగింది. అతని ప్రవర్తనకు కారణం వూహించుకోవటం మొదలు పెట్టింది. ఎన్నెన్నో వూహాలు వచ్చేవి. వూహించుకున్న కొద్దీ మనస్సు చెడిపోయేది. ఆరాటం భరించలేక ఒకరోజు ధైర్యం చేసి అతన్నే అడిగింది.

"గదిలోకి వెడదాం."

అతడు యధాప్రకారం కంగారు పడి బిత్తర చూపులు చూశాడు.

"ఎందుకలా కంగారు పడతావు?"

"కంగారా? కంగారేముంది?" అన్నాడు కుర్రవాడు.

"అయితే, రా" అడిగింది రంగసాని.

"ఇక్కడ బాగానే వుంది."

"ఇంతకంటే అక్కడ బాగుండ కూడదూ?"

"ఆ బాగు నేను భరించలేను."

రంగసానికర్థం కాలేదు. బాగు భరించలేకపోవటం ఏమిటి? అతడేదో తన దగ్గర మభ్యపెడుతున్నాడనుకుంది. తనకు అతడే లోకం. అతనికి మాత్రం అలా కాదు. తనూ కాక ఇంకేదో ఉంది. ఆమెకు చాలా బాధ కలిగింది. "నేను పాపం చేశాను?" అని కన్నీరు పెట్టుకుంటూ బ్రతిమాలింది.

ఆమె కన్నీరు చూచేటప్పటికి ఆ కుర్రవాడు హడలిపోయాడు. "అయ్యో! అయ్యో!" అన్నాడు.

"నన్నెందుకిలా బాధ పెడతావు?" అడిగింది రంగసాని.

"నిన్ను బాధ పెడుతున్నానా?"

"నా తప్పేమన్నా వుంటే చెప్పు."

"నా రంగా..." అని ఏదో చెప్పపోయాడు కుర్రవాడు. అతని పెదవుల నుంచి తన పేరు బయటికి రావటం అదే మొదలు. అతనంత ముద్దుగా ఆమెనంతకు ముందు పిలిచి యెరుగడు. ఆ పిలుపు ఆమె శరీరాన్ని గిలిగింతలు పెట్టింది. ఆమె తన్ను తాను మరిచిపోయింది. అతని చేతుల్లో వాలింది, కౌగిలించుకుంది.

ముద్దుల వర్షం కురిపించింది. ఆమె కౌగిలిలో అతను కరిగిపోయాడు. ఆమె నెమ్మదిగా అతని చెయ్యి పట్టుకుని లేచింది.

అతను ఉలికిపడ్డాడు.

"నా మాట వినవుగా!" అని జాలిగా అడిగింది రంగసాని.

"వింటాను."

"రా మరి."

"అది తప్పు"

"నీకు అక్కర్లేదా అసలు?"

"కావాలి."

"ఇంకేం మరి?"

"అది మలినం."

"ఏది?"

"నువ్వు కోరే శృంగారం."

"ఇంతవరకు జరిగిందో!"

"అది అమలిన శృంగారం"

ఈ విభాగం రంగసానికి అర్థం కాలేదు. తప్పించుకోటానికి ఏదో ఒక వంక చెపుతున్నాడని మళ్ళీ జాలిగా ప్రాధేయపడింది.

"యథార్థం చెప్పు. నాకు నువ్వు తప్ప ప్రపంచం లేదు. నీ వల్ల నాలో ఎంతో మార్పు వొచ్చింది. మధ్యలో నా హృదయాన్ని ముక్కలు చెయ్యకు. ఆనందాన్ని భగ్నం చెయ్యకు. ఇప్పుడు వెనక్కి చూడలేను. వెనక జీవితం అందుకోలేను. ఒక క్రొత్తలోకం చూసి, అది అనుభవంలోకి రాకముందే నన్ను వదలకు. నరకానికి నెట్టివెయ్యకు" అని వరివరి విధాలా బ్రతిమాలింది.

"నన్ను బలవంతం చెయ్యకు" అన్నాడు కుర్రవాడు.

"పోనీ కారణమన్నా చెప్పు" అన్నది రంగసాని.

"నీకు కోపం వొస్తుంది."

"నాకు నీ మీద కోపమా? అసంభవం."

"అయితే, చెప్పనా?"

"చెప్పు, అదే నాకు పదివేలు."

కుర్రవాడు కారణం చెప్పటానికి కొంచెం సేపు తటపటాయించాడు. చివరికి సిగ్గుపడుతూ తల వొంచుకుని చెప్పేశాడు. "నాకు భయం" అన్నాడు.

"భయం ఎందుకు?"

"ఆరోగ్యం చెడిపోతుందని."

ఏదో పెద్ద కారణం చెపుతాడనుకొన్న రంగసానికి ఈ మాట వినేసరికి నవ్వు వచ్చింది. "ఆరోగ్యం చెడిపోతుందా? ఎందుకు చెడిపోతుంది? పైగా బాగుపడు తుంది" అని గుక్కలు పట్టి, నవ్వటం మొదలు పెట్టింది. ఆమె నవ్వుకి ఆ కుర్రవాడు కంగారు పడ్డాడు. ఆమెను భూతాన్ని చూసినట్టు చూశాడు. వెంటనే వెకిలినవ్వు నవ్వాడు. ఆ నవ్వు చూసేటప్పటికి రంగసానికి భయం వేసింది. ఏదో జ్ఞాపకం వచ్చి నిర్జీవ ప్రతిమలా అయిపోయింది.

తెప్పరిల్లి "నే నొకటి అడుగుతాను చెప్పు" అన్నది రంగసాని.

"అడుగు" అన్నాడు కుర్రవాడు.

"ఏమీ అనుకోవు కదా?"

"అనుకోను."

అడుగుతానని అంటం అయితే అన్నది గానీ తీరా అడగాల్సి వొచ్చేటప్పటికి చాలా బాధపడింది రంగసాని... అయినా సంశయంతో కొట్టుకున్న దానికంటే తేల్చుకోవటమే మంచిదనుకుంది.

"ఏమీ అనుకోవు గదా?" మళ్ళీ అడిగింది.

"అనుకోను."

"ఒట్టు?"

"ఒట్టు."

రంగసాని ధైర్యం చేసింది.

"నీకు రోగాలు తగులుతయ్యని..."

అంతే! అంతవరకే మాట్లాడింది రంగసాని.

ఈ మాటకి కుర్రవాడు ఉడికిపోయాడు. రంగసాని దృక్కులను భరించలేక పెడమొగం పెట్టుకున్నాడు.

"చెప్పు, చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టు" అన్నది రంగసాని.

"అవును" అన్నాడు కుర్రవాడు.

ఈ మాట ఆమె మీద పిడుగు పడినట్టయింది. ఆమె పాత జీవితంలోని దృశ్యాలన్నీ వికటట్టహాసం చేస్తూ ఆమె కళ్ళముందు నృత్యం చేశాయి. ఆ కుర్రవాణ్ణి భయ పెట్టటానికి తన పాత జీవితమే కారణం అనుకుంది. అట్లాగే కూర్చునిపోయింది. నోటి వెంట మాట లేదు.

అప్పటి నుంచీ ఆ కుర్రవాడు రంగసాని ఇంటికి రావటం మానేశాడు.

పైగా ఆమెను గురించి దుష్ప్రచారం చేస్తున్నాడని తెలిసింది. తను ఎప్పుడూ ఆమెను ప్రేమించలేదట. ఆమె తనను వలలో వేసుకోటానికి ప్రయత్నించిందట. తన దగ్గర డబ్బు కాజెయ్యటానికి ప్రయత్నించిందట. కాని తనా వల్లో పడేదీ? భోగంది "నేను నిన్ను ప్రేమిస్తున్నా"నని పైకి అంటే మాత్రం తాను నమ్ముతాడా? అందుకని అనుభవించి నన్నాళ్లూ అనుభవించి ఒదిలేశాడట. ఈ మాటలన్నీ రంగసానికి తెలిసినై. ఆమె వూహాసౌధం కూలిపోయింది. ఆమె హృదయం ముక్కలయింది.

కొన్నాళ్ళకి పిచ్చెత్తింది. అప్పటినుంచీ రంగసాని "అడగకుండా వున్నా బాగుండేది! అడగకుండా వున్న బాగుండేది" అని అనుకుంటూ బజార్ల వెంట తిరగటం మొదలు పెట్టింది. తనకు నచ్చిన మగవాడు కనిపిస్తే అతన్ని ఆపి చొక్కా పైకెత్తి, పొట్ట మీద తను చూపుడు వేలితో మూడుసార్లు నెమ్మదిగా పొడిచి, బొడ్డులో గుడుగుడుగుంచం పెట్టి గాని విడిచి పెట్టదు.

ఈ కథ విని నేనొక నిట్టూర్పు విడిచాను. "అయితే మరి ఆ కుర్రవాడే మయ్యాడు?" అని అడిగాను వెంకన్నని.

"అవతల పక్క వూళ్ళో వుంటున్నాడయ్యారూ. పాపం ఆయన మనస్సూ సరిగ్గా లేదు. ఒక మొగాడూ, ఆడదీ మాట్లాడుకోటం ఎక్కడైనా చూస్తే చాలు, అటు అతని పెళ్ళానికి, ఇటు ఆమె మొగుడికి చెప్పి, తగాదాలు పెడతా వుంటాడు. ఎప్పుడూ అదే పని అయ్యోర్యూ" అన్నాడు వెంకన్న.

"ఏమిటోనోయ్, ఎందుకొచ్చిన గొడవ?" అన్నాను విసుగ్గా. అడుగులు బరువుగా వేసుకుంటూ, అరవీశ దోసకాయల్లూ, తుంపు కొత్తిమీరా కట్ట, కరేవేపాకూ, నేనూ భద్రంగా ఇంటికి జేరాం. ■

◆ ◆ ◆

## మెరుపులు

రాజకీయాలలో ఒక విచిత్రముంది. అందరూ అన్ని సిద్ధాంతాలూ చెవుతారు.

అసలు వాళ్ళలో వాళ్ళకి బేధం ఎక్కడో... వాళ్లకే తెలీదు.

ఒకడు 'వాయుదేవుడి గాలి పడం' అంటే ఇంకొకడు 'గాలి దేవుడి వాయు పటం' అంటాడు. అంటే తేడా! ఎవరు, ఎప్పుడు, ఎలా చేసినా ప్రజాస్వామ్యం కోసమేనంటారు. చివరకు ఉపన్యాసం కూడా! అసలు ప్రజాస్వామ్యంలో ఎక్కడుంది ఆకర్షణ? అదేమన్నా అప్సరసా? డబ్బున్న వితంతువా?

కాదు. అదొక అద్దాల మేడ.

శ్రీ త్రిపురనేని గోపీచంద్

◆ ◆ ◆